క్లుప్తంగా

దుర్గాప్రసాద్‌కు పురస్కారం ప్రదానం



నంది అవార్డు అందుకుంటున్న దుర్గాప్రసాద్ పండా

గార: కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో జాతీయ నంది పురస్కారాన్ని జొన్నలపాడు గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ పండా అందుకున్నారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సంస్థ జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ పురస్కారాన్ని అందించి సన్మానం చేశారు. తెలుగు భాషా దినోత్సవాలు, గిడుగు రామ్మూర్తి జయంతి పురస్కరించుకొని సంస్థ 40 మంది కళాకారులకు అవార్డులను ప్రకటించింది. దీంట్లో భాగంగా ఆధ్యాత్మిక, సినీ, జానపద గాయకుడిగా విశిష్ట సేవలందిస్తున్న దుర్గాప్రసాద్‌కు పురస్కారం దక్కింది.

వైద్యుల నిరసన



బాతువలో నల్ల బాడ్జీలను ధరించి విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు

జి.సిగడాం: జీఓ నంబర్ 85ను రద్దు చేయాలంటూ ఆదివారం బాతువ, జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్, జి.అనూష, ప్రతిష్ఠ శర్మ, పేకల సుమబింధు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ 85 వల్ల వైద్యుల సర్వీసులకు అర్థం లేకుండా పోతుందన్నారు. వైద్యులు పీజీ చేయడానికి అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ జీఓను రద్దు చేయాలన్నారు. లేకపోతే ఈ నెల 16 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తామన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని రెండు రోజులుగా కనిపించడం లేదని తండ్రి ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. రణస్థలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చవుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

రూ.64 వేల ఆర్థికసాయం



తిరుపతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఉపాధి సిబ్బంది

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల మండలంలోని ఎస్‌ఆర్‌ఈజీఎస్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న తిరుపతికి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆయనకు ఉపాధి హామీ సిబ్బంది, ఎంపీపీ కలిసి రూ.64 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించారు. ఆమదాలవలస, ఎచ్చెర్ల, జి సిగడాం, లావేరు, రణస్థలం, పొందూరు మండలాలకు చెందిన ఏపీడీ కార్యాలయ సిబ్బంది రూ.54 వేలు, ఎంపీపీ చిరంజీవి రూ.10 వేలు అందించారు.

గ్రోయిన్స్ నిర్మించాలి



ఎంపీ అప్పలనాయుడుకు సమస్య వివరిస్తున్న పొన్నాడ గ్రామస్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని పొన్నాడ పంచాయతీ పరిధిలో గల నాగావళి నది ఒడ్డున ఉన్న జిరాయితీ భూములు 1990 నుంచి నేటి వరకు 25 ఎకరాలు నదిలో కలిసిపోయాయని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. రణస్థలంలోని ఎంపీ కార్యాలయంలో పొన్నాడ గ్రామస్తులు ఎంపీని కలిశారు. గ్రోయిన్స్ నిర్మించి కోతకు అడ్డుకట్ట వేయాలని విన్నవించారు. జిల్లా కలెక్టర్, రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రికి తెలియజేసి సమస్యను పరిష్కరించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రామం రామనగర్‌కు చెందిన జరుగుళ్ల భాస్కరరావు బైక్‌పై వెళ్తుండగా ఎచ్చెర్ల రోడ్డుపై అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదం ఆదివారం జరిగింది. రోడ్డుకు తల బలంగా తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఉన్నత వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎచ్చెర్ల పోలీసులు తెలిపారు.

వరికి తెగుళ్ల బెడద!

- పిలక దశలో సోకిన తెల్ల తెగులు
- వాతావరణ మార్పులే కారణమంటున్న వ్యవసాయాధికారులు
- ఆందోళనలో అన్నదాత



బైరవానిపేటలో పైరుకు ఆకుముడత తెగులు సోకిన దృశ్యం

శ్రీకాకుళం రూరల్: అన్నదాతలో ఆందోళన ఆరంభమైంది. ఇటీవల వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఆరుగాలం శ్రమించి సాగు చేస్తున్న వరి పైరుపై తెగుళ్ల దాడి చేయడమే దీనికి కారణం. అయితే సరైన యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే తెగుళ్ల నుంచి పైరును కాపాడుకోవచ్చునని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో ఈ ఖరీఫ్‌లో 13,700 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను సాగు చేస్తున్నారు. పిలక దశలో ఉన్న పైరుకు వివిధ రకాల తెగుళ్లు సోకినట్టు రైతులు గుర్తించారు. ప్రధానంగా ఆకుముడత, తెల్ల తెగులు సోకినట్టు చెబుతున్నారు. ఇది ఇలాగే ఉంటే పంట దిగుబడిపై తీవ్రప్రభావం చూపుతోందని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు వాతావరణంలో మార్పులు ఏర్పడడం.. ఉష్ణోగ్రతలో వ్యత్యాసాలు చూపడంతో పైరుపై తెగుళ్ల దాడి చేస్తున్నాయి. మండలంలోని అలికాం, క్లోపల్లి, సింగుపురం, వప్పంగి, ఇప్పిలి, బైరివానిపేట తదితర గ్రామాల్లోని వరి పైరుకు తెగుళ్ల సోకడంతో రైతులు సస్యరక్షణ పనుల్లో నిమగ్నమయ్యారు.

పంటలకు నష్టం ఇలా..

ఆకుముడతనే తెల్లతెగులుగా శాస్త్రవేత్తలు గుర్తించారు. గొంగళి పురుగు వరి ఆకును ఆశించి హరిత పత్రాన్ని గోకి తినడం ద్వారా ఆకులు తెల్లబడుతున్నట్టు రైతులు చెబుతున్నారు. సస్యరక్షణ చర్యలు ఆలస్యమైతే ఆకు పూర్తిగా ఎండిపోయి పంట అంతటికీ సోకుతోంది. కాండం తొలిచే పురుగు కారణంగా దుబ్బు మధ్యలో ఎండిపోవడంతో వెన్ను విరిగి పంటకు తీవ్రనష్టం వాటిల్లుతోందని వ్యవసాయ సిబ్బంది చెబుతున్నారు.

సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వాతావరణంలో మార్పులు కారణంగా వరి పైరుకు తెగుళ్లు ఆశిస్తున్నాయి. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. వ్యవసాయ సిబ్బంది సూచనలు రైతులు పాటించాలి. తెల్లతెగులు సోకిన పంటలకు క్లోరిఫైడ్‌పాస్ 2.5 ఎంఎల్ మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా మోనోక్రాటోపాస్ 1.6 ఎంఎల్, ప్రొఫేనోపాస్ రెండు ఎంఎల్ మందును ఒక లీటరు నీటిలో కలిపి ఉదయం లేదా సాయంత్రం వేళలో పైరుపై పిచికారీ చేయాలి. పిచికారీ చేసిన 24 గంటల్లో వర్షం పడితే మరోసారి కచ్చితంగా తెగుళ్ల నివారణ మందును పిచికారీ చేయాల్సి ఉంటుంది.

–ఉషాకుమారి, మండల వ్యవసాయాధికారిణి, శ్రీకాకుళం

ఘనంగా సహాయమిత్ర వార్షికోత్సవం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, సహాయ మిత్ర వలంటీర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం ప్రాంగణంలో సహాయమిత్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం (ఐదో వార్షికోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఆడిటోరియం బిల్డింగ్ ఆవరణంలో వంద మొక్కలు నాటారు. అనంతరం సైకాలజిస్ట్ రాజేశ్వరరావు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన సలహాలు ఇచ్చారు. గ్రామీణ నేపథ్యం కలిగిన మీరంతా దేశంలో గొప్ప వ్యక్తిత్వంతో నడుచుకోవాలని, సమాజంలో గొప్ప మేధస్సు సంపాదించుకొని గొప్ప శక్తివంతులు కావాలన్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులు భావి భారత పౌరులుగా, సమాజాన్ని మార్చే శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఏఓ ముని రామకృష్ణ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు పీయూసీ మొదటి సంవత్సరం నుంచి సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, సహాయ మిత్రా కోఆర్డినేటర్, కె.దిలీప్‌కుమార్, కె.శిరీషారాణి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ పి.ముకుందరావు, అధ్యాపకులు, సహాయ మిత్రా వలంటీర్లు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటితోటల పెంపకంపై శిక్షణ



జీవామృతం తయారీని వివరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఇంటి తోటల పెంపకంపై పెద్దపాడు వద్ద ఉన్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ కేంద్రంలో మూడురోజులు జరిగిన శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రకృతిలో ఉన్న సహజ వనరులతో వ్యవసాయం, పెరటి తోటల పెంపకం గురించి ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి దార్లపూడి రవి రైతులు, గృహిణులకు వివరించారు. బీజామృతం, జీవామృతం, ఆఛ్ఛాదన, వాప్స తయారీ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏహోఎల్ డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు, డీడీసీ సభ్యులు బి.వి.రవిశంకర్, మీడియా కోఆర్డినేటర్ కె.ఎస్.జె.మూర్తి, కె.సందీప్, సురేంద్ర, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన జూట్ బ్యాగుల తయారీ శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరావు

శ్రీకాకుళం కల్చరల్:

స్థానిక బ్యాంకర్స్ కాలనీలో ఉన్న సత్యసాయి మందిరంలోని స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థల సహకారంతో నెల రోజులు నిర్వహించిన ఉచిత శిక్షణ కార్యక్రమం కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. 50 మంది మహిళలకు బ్యాగుల తయారీ, స్క్రీన్ ప్రింటింగ్‌లో శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బైరెడ్ ఆధ్వర్యంలో జూట్ బ్యాగుల శిక్షణ ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిగా ఇక్కడ ప్రారంభమైందని జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కమలా త్రివేణి, ప్రముఖ వైద్యులు మాలతి, రాష్ట్ర ఐటీ సమన్వయకర్త కిశోర్, మన్యం జిల్లా అధ్యక్షులు నేతాజీనాయుడు, కన్వీనర్ ప్రసాదరావు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి నరసింహమూర్తి, సేవాదళ్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, రోటరీ ప్రెసిడెంట్ శ్రీనివాస్, సెక్రటరీ సంతోష్, ఫ్యాకల్టీ యశోద, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఎన్నో లాభాలు



వర్క్‌షాపులో ఔత్సాహికులు

శ్రీకాకుళం కల్చరల్: ధ్యానంతో ఆరోగ్యంతో పాటుగా ఎన్నో లాభాలు ఉన్నాయని పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ సీనియర్ పిరమిడ్ మాస్టర్ గౌతమ్ అన్నారు. స్థానికంగా చిన్నబజారులోని కన్యకాపరమేశ్వరీ ఆలయం వెనుక ఉన్న ఓ కల్యాణ మండపంలో ఒకరోజు వర్క్‌షాపు సామూహిక ధ్యానంపై కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధ్యానం చేస్తే ఆరోగ్యం, ఆనందం లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ శ్వాసమీద ధ్యాస ఉంచాలని సూచించారు. శ్రీకాకుళం టీచర్లు కోపూరి బిందు మాధవి, బాలాజీరావు, శివ, ధర్మారావు, తహసీల్దార్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

పరామర్శ..



కొండములగాం సర్పంచ్ అప్పలనాయుడును పరామర్శిస్తున్న సాయికుమార్, నాయకులు

రణస్థలం: మండలంలోని కొండములగాం సర్పంచ్ గొర్లె అప్పలనాయుడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం ఆదివారం సర్పంచ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. కొండములగాం ఎంపీటీసీ రెడ్డి వాసు సోదరుడు రెడ్డి మోహన్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. సంచాంలో గ్రామస్తులు గొర్లె సీతంనాయుడు ఇటీవల మోకాలికి గాయమైంది, అదే గ్రామానికి చెందిన రెడ్డి రమణ అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసి వాళ్లను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన నవరాత్రులు

- రేపటి నుంచి వినాయక నిమజ్జనాలు



విజయ గణపతికి పూలఅలంకరణ



విజయగణపతిని దర్శించుకున్న సినీనటుడు ప్రభాస్ శ్రీను



పద్మావతినగర్ కాలనీలో అన్నప్రసాద వితరణ



సంపత్ వినాయక ఆలయంలో పూర్ణాహుతి

శ్రీకాకుళం కల్చరల్: గణపతి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి. పలు ఆలయాలు, మండపాలలో పూజలు, దీపారాధనలు, అన్నప్రసాద వితరణలు నిర్వహించారు. సోమవారం నుంచి గణపతులను నాగావళి నదీలో నిమజ్జనం చేసేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయంలో ఉత్సవాల ముగింపు సందర్భంగా పుష్పయాగం జరిగింది. అర్చకులు పెంట శ్రీధర్ శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో రంగురంగుల చామంతులు, గులాబీలు, మల్లెలు, విరజాజులు, సంపెంగలు, కనకాంబరాలు, తెల్ల నందివర్ధనాలతో పుష్పయాగం నిర్వహించారు. సోమవారం సాయంత్రం మట్టి వినాయక నిమజ్జనం పూర్తి చేస్తామన్నారు. కాగా నగరంలోని పలు వినాయక మండపాలు, దేవాలయాల వద్ద పూర్ణాహుతి నిర్వహించి ముగింపు చేశారు. మంగువారి తోటలోని సంపత్ వినాయక దేవాలయంలో లక్ష్మీగణపతి మూల మంత్ర పూర్వక హవనం చేసి అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. అలాగే పీఎన్ కాలనీలోని సిద్ధి బుద్ధి సహిత వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలో కూడా పూర్ణాహుతితో కార్యక్రమాలకు ముగింపు పలికారు. మొండేటివీధి లక్ష్మీగణపతి ఆలయంలో మహిళలచే సామూహి కుంకుమ పూజలు చేసి పూర్ణాహుతి చేశారు. మండపాల వద్ద సాయంత్రం పూజలు నిర్వహించి దీపారాధనలు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణలు చేశారు.

విజయ గణపతిని దర్శించుకున్న ప్రభాస్ శ్రీను

విజయ గణపతిని సినీ నటుడు ప్రభాస్ శ్రీను ఆదివారం దర్శించుకొని పూజలు చేశారు. ఈసందర్భంగా అర్చకులు కండువా వేసి ఆశీర్వచనం అందచేశారు.

మోక్షగుండాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



శ్రీకాకుళం అర్బన్: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్



గాంధీమందిర్‌లో విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న లైసెన్స్ టెక్నికల్ ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):మాట్లాడుతున్న హరికాప్రసాద్



ఎచ్చెర్ల క్యాంపస్: ఇరిగేషన్ ఎస్‌ఈ సుధాకర్‌ను సత్కరిస్తున్న ట్రిపుల్ ఐటీ సిబ్బంది



శ్రీకాకుళం అర్బన్: ఇంజనీర్లను సన్మానిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నేటితరం ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు అతిథిగృహంలో విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజినీర్స్ డేగా ది ఇనిస్టిట్యూషన్ అఫ్ ఇంజినీర్స్ శ్రీకాకుళం లోకల్ సెంటర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంజినీర్లు వి.సుధాకర్‌రావు, పి.శ్రీహరి, వి.వి.నరసింహారావు, సీహెచ్ రమేష్, ఐ.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఇంజినీరు తన వృత్తిలో నిబద్ధత, నిజాయితీ, అంకితభావంతో పనిచేయాలని శ్రీకాకుళం జిల్లా లైసెన్స్ టెక్నికల్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికాప్రసాద్ అన్నారు. శాంతినగర్ కాలనీలోని స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలోఉన్న మోక్షగుండం విగ్రహానికి హరికా ప్రసాద్‌తోపాటు పాటు బృంద ప్రతినిధులు, గాంధీ మందిర్ కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీర్లకు ఆదర్శనీయమని వక్తలు అన్నారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో 57వ ఇంజినీర్స్‌డేని జరుపుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరికా ప్రసాద్ మాట్లాడుతూ.. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజినీర్స్ డేగా జరుపుకోవటం సంతోషంగా ఉందన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి ఎనలేని సేవలు అందించారని, నేటితరం ఇంజినీర్లు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటగోపాలధన బాలాజీ అన్నారు. విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా సివిల్ విభాగపతి తేజ్ కిరణ్, సివిల్ ఇంజినీర్ సురేష్, సివిల్ విభాగం ఆధ్వర్యంల స్టూడెంట్ జింఖానా సెంటర్ క్లబ్ కలిసి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ సూపరింటిండెంట్ ఇంజినీర్ సుధాకర్‌ను ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ బాలాజీ సత్కరించారు.

ఇంజినీర్లకు సత్కారం

శ్రీకాకుళం అర్బన్: సమాజంలో సేవలకు మారుపేరుగా రోటరీక్లబ్ ఆఫ్ శ్రీకాకుళం సెంట్రల్ నిలవడం అభినందనీయమని ఆ క్లబ్ 3020 గవర్నర్ డాక్టర్ మల్లా వెంకటేశ్వరరావు అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆదివారం శ్రీకాకుళంలోని రోటరీక్లబ్ కార్యాలయంలో ఇంజినీర్లు బి.సత్యన్నారాయణ, కె.యోగార్జున్, బాకి సురేష్, వి.శ్రీనివాసరావు, వాండ్రంగి శ్రీనివాసరావు తదితరులను ఘనంగా సన్మానించారు.

నవ సమాజ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీశివాని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సముదాయంలో ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణానికి ఇంజినీర్ల కీలకపాత్ర పోషించాలన్నారు. భారతరత్న విశ్వేశ్వరయ్య దేశానికి చేసి సేవలు మరువలేని అన్నారు.

లక్ష్మీనగర్‌లో అన్న ప్రసాదం వితరణ



శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి లక్ష్మీనగర్‌లో అన్నదానం



శ్రీకాకుళం రూరల్: అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి లక్ష్మీనగర్ అమ్మవారి గుడి ఎదురుగా వినాయక ఉత్సవాలలో భాగంగా అన్నదాన కార్యక్రమం ఆదివారం జరిగింది. లక్ష్మీనగర్ పెద్దలు ఇంజిరాపు శ్రీనివాసరావు, సీర జగన్నాథం, బొత్స జనార్దన్, బరాటం చిన్నప్పన్న, కొండా శ్రీనివాసరావు, గుడియా వేణు, పీస సురేష్,, జి.కృష్ణారావు పాల్గొన్నారు.

బోరపేటలో..

శ్రీకాకుళం రూరల్: క్లోపల్లి పంచాయతీ బోరపేట గ్రామంలో అన్నదానం కార్యక్రమం జరిగింది. రెండు వేల మందికి అన్నప్రసాదాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు వితరణ చేశారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మొక్కలు నాటివేత

గార: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని గ్రామీణ వికాస సమితి విజయనగరం విభాగం సంయోజకులు జె.శ్రీనివాసరావు అన్నారు. అంపోలు పంచాయతీ లింగాలవలస సచివాలయం పరిసరాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఖాళీగా ఉన్న స్థలాల వద్ద చింత, మద్ది, నేరేడు వంటి మొక్కలు నాటడంతో పాటు ఇళ్ల వద్ద వేసుకునేందుకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఖండ సంయోజకులు ఉంగటి వెంకటరమణ, అధ్యక్షులు ముద్దాడ అసిరప్పడు, రుప్ప అప్పారావు, బైరి రామారావు పాల్గొన్నారు.

పాస్ పుస్తకాలు ఇప్పించాలని వినతి

రణస్థలం: తాము ఎప్పటినుంచో సాగులో చేస్తున్న కొండపోడు భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుసేన్ నయాక్‌కు శనివారం రాత్రి ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఆధ్వర్యంలో లావేరు పంచాయతీ పరిధి గూడెం గొలుగులువలస గిరిజనులు వినతిపత్రాన్ని అందజేశారు. జి.జి.వలస నుంచి కొండములగాం మీదుగా రణస్థలం మండల కేంద్రానికి రహదారిని ఎర్పాటు చేయ్యాలని, సామాజిక భవనం, గ్రంథాలయం, శ్మశాన వాటిక షెడ్లు మంజూరు చేయాలని కోరారు. వ్యవసాయ బోర్లు, విద్యుత్ సర్వీసులు, మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో కుటమి నాయకులు, గిరిజనలు పాల్గొన్నారు.

నేడు శాంతి ర్యాలీ

శ్రీకాకుళం కల్చరల్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా నగరంలోని జామియా మసీదు వద్ద నుంచి శాంతి ర్యాలీని సోమవారం నిర్వహిస్తున్నట్లు మసీదు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

విశిష్టమైనది వామనావతారం

శ్రీకాకుళం కల్చరల్: దశావతారాలలో వామనావతారం ఎంతో విశిష్టమైనదని వక్త ఒరుగంటి రాజరాజేశ్వర ప్రసాద్ అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరం, మహతి సంస్థ సంయుక్త నిర్వహణలో సాహిత్య గణపతి ఉత్సవాలలో భాగంగా 'వామన చరిత్ర' అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వక్త రాజరాజేశ్వరీ ప్రసాద్‌ను మహతి విశిష్ట సాహితీ పురస్కారం, నగదు పారితోషికంతో మహతి కన్వీనర్ డాక్టర్ ఇ.ఎస్.సంపత్‌కుమార్, మందిరం సభ్యులు సత్కరించారు. మందిరం అధ్యక్షులు గుమ్మా నగేష్, చాగంటి బాపయ్య, ఎస్.నారాయణమూర్తి, ఈశ్వరరావు, పతంజలి శాస్త్రి, ఎం.మోహనరావు, కోమలరావు, ఎన్.నరసింహమూర్తి, విశ్వేశ్వరరావు, సంగమేశ్వరరావు పాల్గొన్నారు.

హిందీపై పట్టుసాధించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు హైస్కూల్ స్థాయిలోనే జాతీయ భాష హిందీపై పట్టు సాధించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. హిందీ మంచ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కాలేజీలో విద్యావేత్త సురంగి మోహనరావు అధ్యక్షతన జరిగిన హిందీ దివస్ సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు హిందీ చదవడం, రాయడం, మాట్లాడడం నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. హిందీ భాషా వికాసానికి 20 ఏళ్లగా హిందీ మంచ్ చేస్తున్న కృషిని అభినందించారు. విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, హిందీ మంచ్ సమన్వయ కర్త కోనే శ్రీధర్, దొంతం పార్వతీశం, కసుగుల సత్యం, రొంపలివలస రామారావు, సూరంపల్లి బ్రహ్మాజీ, డాక్టర్ దానేటి శ్రీధర్, కొర్ను ప్రతాప్, పాత్రుని పాపారావు, సిద్ధాంతి కొయ్యాన మన్మథరావు, పోలుమహంతి శ్రీకాంత్, ప్రిన్సిపాల్ ఎస్.అప్పలరాజు తదితరులు మాట్లాడారు. అంతకుముందు హిందీ సురేఖన్ పోటీల్లో విజేతలగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హిందీ మంచ్ ప్రతినిధులు వజ్రాల భగత్, షేక్ షరీఫ్, సింగూరు రాధ, వండాన కళావతి, ఎ.ప్రభావతి, ఇ.ఉమారాణి, ఆర్.రాంబాబు, జలుమూరు సత్యం, సీరపు రమణారెడ్డి, భారతి, పుష్ప, వేణు , విజయ భాస్కర్ పాల్గొన్నారు.